
# ఎన్యూమరేషను ఇక్కట్లు

కుప్పా శ్యామలాదేవి

ఎన్యూమరేటరుగా కొన్ని అనుభవాలు చాలా గమ్మత్తుగా వున్నాయి. ఒక ఆదివారం ఉదయమే బయలుదేరాను.



ఒక నడివయస్సు స్త్రీ ఇంటి ముందే ఓ మంచంమీద సత్తు కంచంలో అన్నం తింటూ కనపడింది. "ఏమండీ" అని పిల్చాను.

"ఆఁ ఏం కావాలా...."

"జనాభా లెక్కలు వ్రాసుకోడానికి వచ్చాను. కొద్దిగా వివరాలు చెప్తారా?" చాలా వినయంగా అడిగాను.

"రాసుకో...."

"మీ వయస్సు ఎంత?"

"కిందటి దఫా ఎంత రాశారు?"

అంతకుపూర్వం ఓటర్ల లిస్టు ఒకటి తీసికున్నాం. అది దృష్టిలో వుంచుకొని అడిగినట్లుంది.

పదేళ్ళ క్రితం సంగతా.... అని అడగబోయి మానుకున్నా

"ఏమీ వాయలేదమ్మా. ప్రస్తుతం మీరు చెప్తే వ్రాసుకుంటాను." "ఎంతో కొంత రాసుకో...." పుల్ స్వేచ్ఛ ప్రసాదించింది.

అయినా ఆమెని తేరిపార చూసి కొంచెం జంకుతూనే ఏభై వ్రాయమన్నారా?"

కళ్ళెర్ర చేసిందామె. "ఏభయా మొన్న సంకురేత్రి గ్గాదు నలభై వెళ్ళిందీ...."

"సరే. సరే అలాగేనండి- మరి మీ కుమారుని వయస్సు...."

"ఆఁ ఉంటై. దగ్గిర దగ్గిర ముప్ఫయ్యారో ముప్ఫయి ఏడో...."

హతాశురాలిని అయ్యాను.

"అమ్మా మీ కోడలు వయస్సు...."

"లేకేం - నలభై ఆరేసుకో...."

పొరపాటుపడకుండా ఆమె స్వంత కొడుకే అతడని అడిగి మరీ తెలుసుకున్నా.

మరో ఇంట్లో.

ఇంటి యజమానిగారు వాకిట్లోనే ఈజీ ఛైరులో కూర్చొని చుట్ట కాల్చుకుంటున్నారు.

"ఏమండీ....? ఆఁ ఎవరూ?"

"జనాభా లెక్కలు...."

"ఇంట్లో ఆడవాళ్ళు లేరండీ."

"మీరు చెప్పినా చాలండీ."

"అవేవో నాకేం తెలీదు. ఆడంగులతో మాట్లాడడం నా కలవాటులేదు." ధూఁ అని ఊసి చివాలున లేచిపోయారా మహానుభావుడు.

మా ఖర్మకాలి అంతకుముందు కొద్ది రోజుల క్రితమే ఫామిలీ ప్లానింగ్‌వాళ్ళు. సర్వే వాళ్ళు వచ్చి కొన్ని వివరాలు వ్రాసుకుపోయారట.

మేము వెళ్ళగానే ఓ ఇల్లాలు "ఏవమ్మా మీకేం పనీ పాడూ లేదూ ప్రొద్దుపోకులూ తిరగడవేనా. మొన్న రాసుకుపోయావుగా...." ఆవిడని శాంతపరచాల్సి వచ్చింది.

మరో గృహంలో—

"ఏవండీ, ఎవరూ ఇంట్లో?...."

మూసివున్న తలుపులు తట్టగా తట్టగా లోనుంచి ఉచ్ఛ స్వరంతో వినపడినై స్వాగత వచనాలు....

"తెల్లవారిందీ .... తయారయ్యారూ, వెళ్ళేళ్ళు."

"అమ్మా కాస్త తలుపు తీయాలి?"

"చెప్తుంటే నీక్కాదుటమ్మా."

ధడేల్మని తలుపు తీస్తూ కాస్త నన్ను చూసిన తర్వాత జోరు తగ్గింది. "ఏం కావాలండీ...." కంఠంలో చిరాకు కనపడుతూనే వుంది.

"జనాభా లెక్కలు."

"ఇప్పుడు వీలవదండీ- చంటివాళ్ళు ఏడుస్తున్నారు. వారు వచ్చే వేళ అంది వంటా అవీ కావాలి." తలుపు మూసే ప్రయత్నంలో వుంది. చూస్తే కాస్త చదువుకున్న వ్యక్తిలానే కనపడింది.

"క్షమించండి. కొద్ది టైము చాలు. ఇంతకీ మీరు ఏం చదివారు?"

"బి. ఏ." నా వంక అనుమానంగా చూస్తూ.

"చూడండి కొదిగా కూర్చునేఅవకాశం ఏమైనావుందా...." అప్పటికే కాళ్ళు లాగేస్తున్న నా అభ్యర్థన.

"ఏమందోయ్ మీక్కావలసినవివరాలు మగవాళ్ళకు తెలుస్తాయికాని నన్ను ఇబ్బంది పెట్టకండి. మీకు వీలైతే వారాద్వాక రండి...."

ఇంకా సేపువుంటే నన్ను బయటకునెట్టి మరీ తలుపువేసుకునేలా వుంది. ఆ ప్రక్క ఇంటికి వెళ్దామనుకుంటుండగా....

"ఇలాగే పగలువచ్చి అన్ని వివరాలూ తెల్సికొని రాత్రిపూట దొంగతనాలకి వస్తారు" పిన్ని అన్నమాటలు వినపడినై.

మరో ఇల్లాలు—

అన్నీ తీరికగానే చెప్పిందికాని. చివరి ప్రశ్నల దగ్గర కొచ్చేసరికి (నేను శాంపిల్ బ్లాకు లేండి) చిరాకుపడింది.

"ఎంతమంది పుడితే నీ కెందుకు? ఎంతమంది ఛస్తే నీ కెందుకమ్మా? ఉన్న వాళ్ళని రాసుకోవమ్మా.... గోలా."

మరోచోట—గేదెకు పాలు తీస్తూం దట.

"ఇప్పుడే సమయం దొరికిందీ నీకు. ఏంటమ్మా అలా చూస్తావు" గసిరింది. నా కసలు తెలీదు అలా నిలబడరాదని!

ఇంకో భవనంలో పిలవగా, పిలవగా.... ఓ ముసలాయన బయటికి వచ్చారు.

"ఆఁ, హా.... జనాభా లెక్కలా.... కూర్చోండి. హమ్మయ్య కూర్చున్నాను.

"మీకెంత మంది పిల్లలండి. తల పంకించాడు ఆకాశం కేసి చూశాడు విన పడలేదేమోననుకొని "అయ్యా. మీకు పిల్లలు....?"

"వినపడింది. వినపడింది. ఒక్క క్షణం ఆగండి!" కళ్ళు మూసుకొని. ఆడపిల్లలా. మగపిల్లలా." అన్నాడు.

"ఇద్దరి సంగతీ చెప్పండి."

"అయితే....!" మళ్ళీ కళ్ళు మూతలు పడినై . ఆరుగురు.. (ఒక్క క్షణంఆగి).. మగపిల్లలు. అయినా.... అదో ఇద్ద.... ఆఁ ఏడుగురు ఆడపిల్లలండి."

"అయ్యా ఇక్కడ వుండేవాళ్ళవి మాత్రమే వివరాలు చెప్పండి."

"ఇక్కడ పుట్టి పెరిగినవాళ్ళవేనండీ" సాగదీశాడాయన.

"సరే మీ పెద్దబ్బాయి పేరు....?"

"పెద్దాడి పేరా రాధాకృష్ణ అఁహఁహ కాదు రామకృష్ణ" ఇలా రాయించి కొట్టే యిస్తూ, పేరుకి మూడు నిమిషాలచొప్పున పదకొండుమందిసంతానం (ఒకామెచచ్చి పోయినట్లు ఆఖరికి క్లియరు చేశాడు) వారి పౌరసన్సు వారి సంతానం పేర్లు చెప్ప డానికి దాదాపు రెండు గంటలు పట్టింది.

"సార్, కాస్త త్వర త్వరగాచెప్పండి. ఇంకా చాలా ఇళ్లు వ్రాయవలసి వుంది." బతిమిలాడినట్లు అన్నాను.

ఆయన నావంక విచిత్రంగా చూశాడు. ఇంక ఇంగ్లీషులో మొదలెట్టాడు. తను ఎవరో నాకు తెలీలేదుట. తను దొరకడం నా అదృష్టంట. ఎప్పుడూ కలకత్తా, బొంబే. మద్రాసు తిరుగుతూ ఉంటాడుట. మన మంత్రులలో ఓమంత్రిగారి వేలువిడచిన మేనమామకొడుకు అల్లుడి తమ్ముడట. చివరికి మీకంత తొందరగావుంటే వెళ్ళిపొమ్మన్నారండి. కానీ మేము రేపు ఈ ఇల్లు ఖాళీచేసిపోతున్నాము. బొంబే మానేటివు అని చల్లగా చెప్పాడు.

ఇంకో ఇంట్లో మధ్యాహ్నం రెండయింది.

తలుపులు వేసి వున్నాయి. పక్కింటి వారి నడిగాను "ఊరెళ్ళారా"అని. లేదండి బహుశః నిద్రపోతున్నారేమో ఒక తల్లీ కుమార్తె మాత్రం ఉంటారని విన్నాను. అన్నాడు.

తలుపు నెట్లగానే వచ్చేసింది.

కాని....చూడకూడని దృశ్యం. గాభరా పుట్టి బయటికి వచ్చేశాను.

మరో ఇంట్లో ఆ ఇల్లాలు నీళ్ళకి వెళ్ళింది.

ఆమె వచ్చేదాకా ఓపిగ్గా యెదురుచూచి వివరాల సేకరణకి పుపక్రమించాను.

"మీ వారి పేరు "

భర్తమాట వినేసరికే సిగ్గుతో పాము లాగా మెలికలు తిరిగింది. చిన్నదా, చిత కతా ముగ్గురు పిల్లల తల్లి! పైగా నేను తోట స్త్రీనే కదా! చెప్పడానికేవీ?

'ఒదినో, ఓవదినా'.... కేకలువేయడం మొదలెట్టింది.

ఆ ఒదిన మరో ముచ్చట్ల సెంటరులో వుంది. ఆమెని పిలిపించి ఆమెచేత, ఈమె భర్తపేరు చెప్పించే సరికి నా తలప్రాణం తోకకి వచ్చింది.

ఇంతలో ఓ మాజీ పంతులుగారు తటస్థ పడ్డారు.

"ఏమ్మా జనాభా లెక్కలా ఇంత శ్రమ పడాలిటమ్మా. మా కాలంలో అయితేనా, ఇళ్ళల్లో కూర్చొనే వ్రాసేవాళ్ళం...." ఆయన కొన్ని చిటకాలు ఉచిత సలహాల రూపంలో ఇచ్చి వెళ్ళారు.

ఇంకో గృహిణి—

"ఎవండీ, ఎన్నడూ, ఇన్ని వివరాలు అడగలేదే? పంచదార కార్డు లేవన్నా ఎక్కువ యిస్తారా? బియ్యంకోటా పెంచుతారా? మా పిల్లలకేవైనా ఉద్యోగాలు చూపిస్తారా? ఇళ్ళు లేనివారికి కట్టించి యిస్తారా? ముందు మీ అడ్రస్‌చెప్పండి."

ఇంకో కాలేజీ గర్ల్ :

"మీరు కట్టుకొన్న శారీ చాల బావుందండీ? ఎక్కడ కొన్నారూ?" వాళ్ళఅమ్మ "మీకెంతమంది పిల్లలండీ?"

వాళ్ళ బంధువు "ఇలా ఇంటింటికీ తిరిగినందుకు మీకేమిస్తారూ? పాపం ఎండంతా మీ పాలేనే" నామీద జాలి!

"అమ్మా మీ వివరాలు సేకరించడానికి వచ్చాను కానీ, నా వివరాలు చెప్పడానికి కాదు" అని మనస్సులోనే అనుకొని— మళ్ళా పైకి అంటే నామీద దురభిప్రాయంతో వివరాలు సరిగ్గా చెప్పరేమోనని భయం.

ఇంకో ఇంట్లో—

కనీసం అరవై సంవత్సరాలుంటై ఆయనకి. సెంటువాసన గుప్పుమంటోంది. నోట్లో కారా కిల్లీ! ఆడవాళ్ళు వున్నా— నేను వారినే ప్రశ్నిస్తున్నా తనే ముందు కొస్తాడు చాలా ఉత్సాహంగా అఖర్లేని వివరాలుకూడా చెప్తూనూ.

ఓ ఇంట్లో మామ్మగారు నన్నెంతో ఆప్యాయంగా పలకరించి, చాలారోజుల నుంచి పరిచయం ఉన్నవాళ్ళకుమల్లే ప్రవర్తించింది. కాఫీచేసి ఇచ్చింది. చివరికి ఇలా అన్నారామె "ఇలా ఊరంతా తిరుగుతూనే వుంటావా?"

"లేదండి. రెండు మూడు వీధులు మాత్రమే!"

"అయితే అమ్మాయీ- ఏమీ అనుకోకూ ఎలాగూ వివరాలు కనుక్కుంటూనే వున్నావు కనక కాస్త కులం గోత్రం కూడా కనుక్కుంటూ వుండు. మా మనవరాళ్ళని ముగ్గురీన్ని చూశావుగా వాళ్ళకి కాస్త ఈడూ జోడూగల పిల్లవాళ్ళు తటస్థపడితే వాళ్ళ జాతకాలు అడిగితీసికో - కాస్త ఈ ఉపకారం చేసి పెట్టమ్మా నీ పుణ్యం ఊరికేపోదు."

అమ్మాయిలజాతక చక్రాలు తేవడానికి లోనికివెళ్ళారామె. వాళ్ళమనమరాళ్ళసలహా మీద. నా డ్యూటీ ఎన్ని శాఖలు వేస్తున్నదో ఊహించుకుంటూ బయటపడ్డాను.

